గురుకులాల ప్రవేశ పరీక్ష గడువు పెంపు

ఖమ్మం రూరల్, జనవరి 6: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష గడవు పొడిగించడం హర్షణీయమని ప్రొగ్రెసీవ్ పేరెంట్స్ లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పుల రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి11న జరిగే పరీక్షను ఫిబ్రవరి 20వ తేదీ వరకు పొడగించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లితండ్రులు గమనించాలని ఆయన కోరారు.

మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ప్రారంభం

కూసుమంచి, జనవరి 6: కూసుమంచిలో రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరురి దయాకర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'డీడీ డబ్బులు వెనక్కు తీసుకోవద్దు'

పెనుబల్లి, జనవరి 6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా గొర్రెల పెంపకందారుల ఖాతాల్లో వెంటనే రూ.2 లక్షల చొప్పున నగదు బదిలీ చేయాలని గొర్రెల, మేక పెంపకందారుల సంఘం రాష్ట్ర గౌరవ ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య విజ్ఞప్తి చేశారు. పెనుబల్లి ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఆయన సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గొర్రెల యూనిట్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది సర్కార్‌కు డీడీలు అందించారని, కొత్త ప్రభుత్వం నూతన విధి విధానాలను ప్రకటించే వరకు గొల్ల కురుమలు డీడీ డబ్బులు వెనక్కు తీసుకోవద్దని సూచించారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

వైరా టౌన్, జనవరి 6: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి శనివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధులకు క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు పండ్లు, బ్రెడ్ అందించారు. జీఎంటీ కో-ఆర్డినేటర్ శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి: ఎంపీడీవో

చింతకాని, జనవరి 6: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా 26గ్రామాల ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ధరఖాస్తు ఆన్‌లైన్ పక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీవో తేళ్ళూరి శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు డేటాఎంట్రీ పక్రియకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, డేటా ఆపరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

వేంసూరు, జనవరి 6: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కందుకూరు- దుద్దేపుడి గ్రామాల మధ్య జరిగింది. ఎస్సై వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం తుంబూరుకు జహీర్ బాషా (37) శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాషా దుద్దేపుడి గ్రామ సమీపంలోని కాలువలో ప్రమాదవశాత్తు పడి గాయాల పాలై మృతిచెందాడు. స్థానికులు గుర్తించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బచ్చోడు మాజీ సర్పంచ్ సునీతారెడ్డికి నివాళి

మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం, జనవరి 6: మండలంలోని బచ్చోడు మాజీ సర్పంచ్ రామసహాయం సునీతారెడ్డి (90)శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి,, మాజీ ఎమ్మెల్యే కందాళ కుమార్తె దీప్తిరెడ్డి, ఎంపీపీ మంగీలాల్, జడ్పీటీసీ శ్రీనివాసరావు, బీరోలు సొసైటీ చైర్మన్ నరేశ్‌రెడ్డి, నాయకులు దయాకర్‌రెడ్డి, రాయల నాగేశ్వరావు సునీతారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మంత్రి పొంగులేటి, కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు.

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 6: నగరంలోని హార్వెస్ట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి తల్లి రామసహాయం సునీతాదేవి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి స్వగ్రామం తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు. ఆమె మృతికి హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపాన్ని ప్రకటించారు.

ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు

సత్తుపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

మధిర రూరల్ : దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మధిరరూరల్, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శనివారం మండలంలోని సిరిపురం గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హులైన ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గ్రామసభలను పరిశీలించిన కలెక్టర్

ఎర్రుపాలెం, జనవరి 6: మండలంలోని ఎర్రుపాలెం, మీనవోలు, బనిగండ్లపాడు గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభలను జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ వేణుమనోహర్, తహసీల్దార్ ఎం ఉషాశారద, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్తుపల్లి/పెనుబల్లి, జనవరి 6: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. మండల పరిధిలోని తాళ్లపెంట, తుమ్మలపల్లి, కొత్తలంకపల్లిలో చివరి రోజు శనివారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను ఆమె సందర్శించి మాట్లాడారు. ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. తొలుత ఆమె పట్టణంలోని 22, 23 వార్డులతో పాటు నారాయణపురం గ్రామసభను సందర్శించారు.

ఖమ్మం రూరల్, జనవరి 6: డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు మండలంలోని 28 గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి 30,637 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వీటితో పాటు నూతన రేషన్‌కార్డుల కోసం 6,927 దరఖాస్తులను స్వీకరించారు.

వైరా టౌన్/ వేంసూరు, జనవరి 6: వైరా పట్టణంలోని 15వ వార్డులో శనివారం చివరి రోజు ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సందర్శించారు. ప్రజాపరిపాలన సభ జరుగుతున్న తీరును పరిశీలించారు. వేంసూరు మండలంలోని భరణిపాడు, పల్లెవాడ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీపీ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఎంపీడీవో రమేశ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కూసుమంచి మండలంలో

కూసుమంచి, జనవరి 6: మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు శనివారంతో ముగిశాయి. మండలంలో మొత్తం 19,858 దరఖాస్తులను అధికారులు ప్రజల నుంచి స్వీరించారు. తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రామచందర్‌రావు ఆధ్వర్యంలో మూడు టీంలు మండలంలో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. గ్రామసభలను మంత్రి పొంగులేటి, జిల్లా నోడల్ అధికారి రఘునందన్‌రావు, కలెక్టర్ గౌతమ్, నియోజకవర్గ స్పెషలాఫీసర్ శ్రీరాం, మండల స్పషలాఫీసర్ శ్రీలత సందర్శించారు.

తల్లాడ, జనవరి 6: చివరి రోజు శనివారం గొల్లగూడెం నుంచి 547 కుటుంబాలు, నూతన కల్‌లో 740, గోపాలపేటలో 550, తెలగవరంలో 276 కుటుంబాల నుంచి ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు అందాయి. గోపాలపేట గ్రామసభను ఎంపీపీ శ్రీనివాసరావు సందర్శించారు.

కల్లూరు, జనవరి 6: మండలంలో శనివారంతో ప్రజాపాలన గ్రామసభలు ముగిశాయి. చివరి రోజు రఘునాథగూడెంలో గ్రామసభ జరిగింది. మండలవ్యాప్తంగా 25 వేల కుటుంబాల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

కారేపల్లి, జనవరి 6: మండలంలోని 41 పంచాయతీల పరిధిలో శనివారంతో ప్రజాపాలన గ్రామసభలు ముగిశాయి. అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఎనిమిది రోజుల పాటు సుమారు 20 వేల కుంటుబాల నుంచి ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు స్వీకరించారు.

తిరుమలాయపాలెం, జనవరి 6: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా జరిగిన గ్రామసభలో మండల వ్యాప్తంగా 22,691 మంది దరఖాస్తులు అందజేశారని అధికారులు తెలిపారు. అందులో కొత్త రేషన్ కార్డుల కోసం 2406 దరఖాస్తులు అందజేశారు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

మిషన్ భగీరథ ప్రాజెక్టు అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

పంప్‌వెల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర, జనవరి 6: మిషన్ భగీరథ పనులను నిర్ధేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం ఎర్రుపాలెం మండలంలోని మామునూరు గ్రామంలో మిషన్ భగీరథ సమీక్ష నిర్వహించారు. తొలుత మిషన్‌భగీరథ సీఈ కే శ్రీనివాస్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మిషన్ భగీరథ పథకం గురించి వివరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలోని కట్టలేరు ప్రాజెక్టు లెఫ్ట్, రైట్ కెనాల్ పూర్తి చేసేందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. జాలిముడి ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా మెయింటనెన్స్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ బిల్లులు నిలి, బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల కోసం రోడ్లను తవ్వి వదిలేయడంతో ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం ఆయన మిషన్‌భగీరథ పంప్‌వెల్‌ను పరిశీలించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్ దత్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవాలి

మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి ఆయేషా షరీన్

సత్తుపల్లి రూరల్, జనవరి 6: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలని సత్తుపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆయేషా షరీన్ ఆకాంక్షించారు. సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయచైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. సదస్సులో న్యాయవాదులు సతీశ్, నల్లగట్ల విజయ్‌కుమార్, తనగాల అరుణకుమారి పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధం చేయాలి

మధిరలో నిర్మిస్తున్న ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

మధిర, జనవరి 6: నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రధాన ఆసుపత్రి జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. శనివారం సాయంత్రం మధిర డిగ్రీ కళాశాల సమీపంలో గత ప్రభుత్వం రూ.34 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించి వివరాలను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పనులు ఆలస్యమయ్యాయని, వెంటనే పనులను వేగవంతం చేయాలన్నారు. ఆసుపత్రి ఎదుట నిరుపయోగంగా ఉన్న ఔట్‌డోర్ స్టేడియం భవనాన్ని పరిశీలించి వాటి మరమ్మతులు చేసి పెట్టర్లను ఏర్పాటు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట సీపీ సునీల్‌దత్, డీఎంహెచ్‌వో మాలతి, ఈఈ వెంకటేశ్వర్లు, అధికారులు ఉన్నారు.

కట్టుకున్నోడే కాలయముడు

గొడ్డలితో భార్యను నరికి చంపిన భర్త

అనుమానం నేపథ్యంలోనే హత్య.. శివాయిగూడెంలో ఘటన

భర్త వీరన్నతో ఆదిలక్ష్మి (ఫైల్)

రఘునాథపాలెం, జనవరి 6: భార్యను భర్త గొడ్డలితో కిరాతకంగా హతమార్చిన ఘటన శివాయిగూడెంలో జరిగింది. సీఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం పూసుపల్లికి చెందిన ఆదిలక్ష్మి (26), ఖమ్మం జిల్లా రఘునాథపాలెం శివాయిగూడేనికి చెందిన మూడ్ వీరన్న పదేళ్ల క్రితం ప్రేమించుకున్నారు. ఇరువైపులా పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరన్న టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలం నుంచి వీరన్న ఇదే గ్రామానికి చెందిన మరో మహిళతో అక్రమ సంబంధం నెరుపుతున్నాడు. మూడు నెలల క్రితం సదరు మహిళను తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిరోజుల తర్వాత వీరన్న గ్రామానికి తిరిగి వచ్చాడు. దీంతో భార్య పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టింది. పెద్దల వద్ద తన తప్పును ఒప్పుకొని వీరన్న మళ్లీ కాపురాన్ని ప్రారంభించాడు. వీరన్న తర్వాత భార్యను అనుమానించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో వీరన్న శనివారం భార్యతో గొడవపడి ఆమెపై గొడ్డలితో దాడి చేసి హతమార్చాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలాన్ని ఖమ్మం ఏసీపీ హరికృష్ణ, సీఐ శ్రీధర్ పరిశీలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

కొణిజర్ల, జనవరి 6: తనికెళ్ల విజయ ఇంజినీరింగ్ కళాశాలలో చేపడుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 18,534 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఎంపీడీవో కె.మహాలక్ష్మి వివరించారు.

'నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయం'

మాట్లాడుతున్న పెద్దింటి సూర్యనారాయణ

సత్తుపల్లి టౌన్, జనవరి 6: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయని రాష్ట్ర చిన్న, లఘు, మధ్యతరహా పరిశ్రమల సంస్థ (ఎంఎస్ఎంఈ) ఉపాధ్యక్షుడు పెద్దింటి సూర్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమం నిమిత్తం శనివారం సత్తుపల్లికి విచ్చేసిన ఆయన విలేకర్లతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో సంస్థ పరిధిలో సేవలను ప్రారంభించామన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా కమిటీలు వేస్తామన్నారు. సంస్థ ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి యువతకు చేయూతనందిస్తామన్నారు. సదరు పరిశ్రమల నుంచి బయటకు వచ్చే ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి ఎంఎస్ఎంఈ పీసీఐ గ్యారంటీతో రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. సంస్థ డిప్యూటీ వైస్‌చైర్మన్ హరీష్ పాల్గొన్నారు.

వచ్చే నెల 5 నుంచి టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 6: పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు వచ్చే నెల 5 నుంచి 10 వరకు డీసీఈబీ ఆధ్వర్యంలో స్పెషల్/గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఈమేరకు శనివారం పర్యవేక్షణాధికారులకు షెడ్యూల్ పంపించామని, విద్యార్థులందరూ పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను ఎమ్మార్సీసీల నుంచి తీసుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. 5న తెలుగు, 6న హిందీ, 7న ఇంగ్లిష్, 8న గణితం, 9న సైన్స్, 10న సోషల్ పరీక్ష నిర్వహించాలన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని వ్యక్తి ఆత్మహత్య

పెనుబల్లి, జనవరి 6: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పార్థసారథిపురంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పేటేటి వెంకటేశ్వరరావు(30)కు ఏడేళ్ల క్రితం పాల్వంచకు చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, ఒక బాబు. ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తునానరు. భార్యాభర్తల మధ్య కొద్దిరోజుల నుంచి చిన్నచిన్న గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమె కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వీఎం బంజర పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

చెరువులో పడి మత్స్యకారుడి మృతి

రఘునాథపాలెం, జనవరి 6: చెరువులో పడి ఓ మత్స్యకారుడు మృతి చెందిన ఘటనపై ఖానాపురం హవేలీ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరం కొత్తగూడేనికి చెందిన పిట్టల కనకయ్య(40) కొత్తగూడెం చెరువు మత్స్య సంఘంలో సభ్యుడిగా కొనసాగుతున్నాడు. కనకయ్య గురువారం చెరువు కాపలాకు మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. ఈక్రమంలో పడవపై చెరువులోకి దిగారు. తిరిగి వచ్చే క్రమంలో కనకయ్య ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. శనివారం ఉదయం కనకయ్య మృతదేహం పోలీస్ స్టేషన్‌లో కనిపించింది. మృతుడి భార్య సైదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

బోనకల్లు, జనవరి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. శనివారం బోనకల్లులో జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి శాస్త్రీయ, లౌకిక విలువలతో కూడిన విద్యావిధానం రూపొందించాలన్నారు. సర్వశిక్ష కేజీబీవీ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమమ్ టైంస్కేల్ అమలు చేయాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లంకొండ రాంబాబు, చంద్రప్రసాద్, షేక్ నాగుర్‌వలీ, రామకృష్ణ, ప్రీతం, నర్సింహారావు, అనిత పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లి టౌన్, జనవరి 6: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, వారితో పని చేయించకూడదని సత్తుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్ అన్నారు. పాఠశాలలో శనివారం డ్రాపౌట్స్ అవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పిల్లలను తప్పకుండా బడికి పంపాలని సూచించారు.

సంక్షిప్తం

డైరీ ఆవిష్కరణ

సత్తుపల్లి టౌన్, జనవరి 6: పట్టణంలోని జవహర్ నగర్ తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సంఘం రూపొందించిన డైరీని శనివారం ఉప కోశాధికారి సునీల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చెంచిరెడ్డి, కేశవరెడ్డి, బద్రుద్దీన్, బూరుగు దాసు, జి.కృష్ణయ్య, ప్రకాశరావు, వెంకటరత్నం, మధుసూదనరాజు పాల్గొన్నారు.

ఐరన్ బీరువా వితరణ

ఖమ్మం వ్యవసాయం, జనవరి 6: అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పాకబండ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు నరేష్, సౌమ్య శనివారం ఐరన్ బీరువాను వితరణగా అందజేశారు. పర్యవేక్షకురాలు సునీత, టీచర్ అరుణ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

చింతకాని, జనవరి 6: మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం పోటు శ్రీనివాసరావు కూసుమంచి మండలానికి బదిలీపై వెళ్లిన సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ అధికారిగా విద్యావ్యవస్థకు మంచిపేరు తీసుకువచ్చారన్నారు.అధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల సత్తా

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 6: ఐఎన్టీఎస్వో ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 314 మంది విద్యార్థులు సత్తా చాటారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ శనివారం తెలిపారు. ద్వితీయ పరీక్షకు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ శ్రీవిద్య అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తల్లాడ, జనవరి 6: అన్నారుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.నరసింహారావు టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు సుధాకర్, పాపయ్య, రాజకుమారి, మురళీకృష్ణ, టి.సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు అందజేత

ఖమ్మం రూరల్, జనవరి 6: మండలంలోని ఎం వెంకటయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, గిప్టు ప్యాక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మందాటి సంధ్యారాణి మాట్లాడుతూ సంస్థ అందించిన వస్తువులను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని తల్లితండ్రులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి హెచ్ఎం జీ శ్రీనివాసరావు, సొసైటీ ప్రతినిధి జాన్, ఉప సర్పంచ్ పడిగెల ఉపేందర్, గ్రామస్తులు రమణ, మద్దెల నాగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

కొణిజర్ల, జనవరి 6: గ్రేస్ సర్వీస్ సొసైటీ సమకూర్చిన దుప్పట్లు, స్వెట్టర్లను శనివారం తనికెళ్ల గ్రేస్ చిల్డ్రన్స్ పాఠశాలలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సొసైటీ అందిస్తున్న సేవలను కొనియాడారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

తల్లాడ, జనవరి 6: అన్నారుగూడేనికి చెందిన బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు గొడ్ల ప్రభాకర్ తల్లి లక్ష్మి శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని లక్ష్మి మృతదేహానికి నివాళి అర్పించారు.

వెంకటయ్యకు నివాళి

ఖమ్మం రూరల్, జనవరి 6: మండలంలోని కామంచికల్ గ్రామ శివారు ముత్యాతగూడెం గ్రామానికి చెందిన మేదరమట్ల వెంకటయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కుమార్తె కందాళ దీపిక శనివారం ముత్యాలగూడెం వెళ్లి వెంకటయ్య చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముదిగొండలో వైద్యశిబిరం

ముదిగొండ, జనవరి 6: వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా